# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 63 | విశాఖపట్నం | 3-12-2025 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 63 | VISAKHAPATNAM | 3-12-2025 WEDNESDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


## మొంథా తుపాను నష్టం రూ.6,352 కోట్లు..

# అమిత్‌షాకు వివరించిన లోకేశ్, అనిత



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఇటీవల రాష్ట్రంలో సంభవించిన మొంథా తుపాను కారణంగా రూ.6,352 కోట్ల మేర నష్టం వాటిల్లిందని మంత్రులు లోకేశ్, అనిత కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి నివేదిక అందజేశారు. పార్లమెంట్ హాల్‌లోని అమిత్ షా ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో లోకేశ్, అనితతోపాటు టీడీపీ ఎంపీలు పాల్గొన్నారు. తుపాను వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడమే కాకుండా మౌలిక సదుపాయాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ తుపాను వల్ల మొత్తం 3,109 గ్రామాలు ప్రభావితమయ్యాయని వివరించారు. ప్రతి ప్రభావిత కుటుంబానికి తక్షణ సాయంగా ఏపీ ప్రభుత్వం తరపున రూ.3 వేలు అందించామని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.271 కోట్లు, గృహ నష్టం రూ.7 కోట్లు, రహదారులు, మౌలిక సదుపాయాలకు రూ.4,324 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.41 కోట్లు, నీటి వనరులు, నీటిపారుదల ప్రాజెక్టులకు రూ.369 కోట్లు, శాశ్వత నిర్మాణాలకు రూ.1,302 కోట్లు, సామూహిక ఆస్తులకు రూ.48 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. మొత్తం రూ.6,352 కోట్ల నష్టంలో ఎన్డీఆర్ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం తక్షణ ఉపశమనం, తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ.902 కోట్లు అవసరమన్నారు. తుపాను నష్టంపై కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన కూడా జరిపిందని అమిత్ షాకు లోకేశ్ తెలిపారు. అమిత్ షాతో అనంతరం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మంత్రులు కలిశారు. మొంథా తుపాను నష్టంపై నివేదిక అందజేశారు. పరిహారం త్వరగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మొంథా తుపాను నష్టాన్ని వివరిస్తూ ఈ తుఫాను మొత్తం 24 జిల్లాల్లోని 443 మండలాల పరిధిలో 3,109 గ్రామాలను ప్రభావితం చేసిందని సుమారు 9.53 లక్షల మంది ప్రజలు నష్టాన్ని చవిచూశారని చెప్పారు. పంట మునిగిపోవడం, నదుల ఉద్ధృతి, సముద్ర అలల ప్రభావం వల్ల వ్యవసాయ జీవనోపాధి, మౌలిక సదుపాయాలు, పౌర సేవా రంగాలకు భారీనష్టం సంభవించిందని తెలిపారు.

అలానే ఈ తుపాను కారణంగా వ్యవసాయ పంటలకు భారీగా నష్టం సంభవించిందని సుమారు 1.61 లక్షల హెక్టార్ల పంటలు (వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, కంది పప్పు, చిరుధాన్యాలు మొదలైనవి) దెబ్బతిన్నాయని వివరించారు. దీంతో 3.27 లక్షల మంది రైతులు ప్రభావితమయ్యారని, ఉత్పత్తి నష్టాలు సుమారు 4.36 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందని పేర్కొన్నారు. పండ్ల తోటలు, ఉద్యాన పంటలపై ప్రభావం: రాష్ట్రంలో సుమారు 6,250 హెక్టార్లలో అరటి, బొప్పాయి, కొబ్బరి, పసుపు, మిరప, కూరగాయలు, పూలు, ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని మంత్రులు తెలిపారు. ఏపీ ప్రభుత్వం సమయోచితంగా చర్యలు తీసుకుని, ప్రజల తరలింపు, సహాయ శిబిరాల నిర్వహణ, ఎస్డీఆర్?ఎఫ్?/ఎన్డీఆర్?ఎఫ్? బృందాల మోహరింపు, వివిధ శాఖల ద్వారా నష్టాల అంచనా వంటి చర్యలను వేగంగా అమలు చేసిందని వివరించారు. ఈ చర్యలు మానవ నష్టాలను తగ్గించడంతోపాటు బాధితులకు నిరంతర సహాయాన్ని అందించడంలో ఇబ్బందులు లేకుండా చేశాయని మంత్రులు పేర్కొన్నారు.

## ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్రాజెక్టులు

# చేపట్టాలి: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది పాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. వినియోగదారే విద్యుత్ ఉత్పత్తిదారులను చేస్తూ భవనాలపై సౌర విద్యుత్ ఉత్పత్తి పెంచేలా ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేశారు. ఇంధన రంగంలో ఒప్పందాలు 60 రోజుల్లో కార్యారూపం దాల్చాలని అదికారులను ఆదేశించారు. గత పాలకులు పీపీఏలు రద్దు చేసి ప్రజలపై 9 వేల కోట్ల భారం మోపినా విద్యుత్ వ్యవస్థల సమర్ధ నిర్వహణతో భారాన్ని జీరో చేశామని సీఎం అభిప్రాయపడ్డారు.అమరావతి సచివాలయంలో విద్యుత్ శాఖపై మంత్రి గొట్టిపాటి రవితో కలిసి సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, పీఎం కుసుమ్, ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ పథకం, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యయం తగ్గింపు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు. రాష్ట్రంలో కీలకమైన పరిశ్రమలుగా ఫెర్రో అల్లాయ్స్? గుర్తించి మరో ఏడాదిపాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తున్నట్టు సీఎం ప్రకటించారు. తద్వారా ప్రభుత్వంపై 1,053 కోట్ల భారం పడనుంది. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేకించి విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలను 2029 నాటికి 9.20 శాతం నుంచి గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఒప్పందాలు కుదుర్చుకోవాలని దిశానిర్దేశం చేశారు. పీఎం కుసుమ్ సహా ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# సాగునీటి రంగాన్ని ధ్వంసం చేసిన జగన్: నిమ్మల



**అమరావతి, పతాకం న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర సాగునీటి రంగం పూర్తిగా ధ్వంసమైందని, సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దానిని తిరిగి ప్రగతి పథంలోకి తెస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో ప్రాజెక్టులన్నీ నిర్వీర్యమై రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. 2014-19 మధ్య చేపట్టిన పనులను జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో రద్దు చేశారని నిమ్మల దుయ్యబట్టారు. ఇసుక మాఫియా కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 42 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పులిచింతల, గుండ్లకమ్మ వంటి ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఫలితంగా ప్రతి నియోజకవర్గంలో వేల ఎకరాల్లో సాగు దిగుబడి తగ్గి రైతులు వలసబాట పట్టారని అన్నారు. గోదావరి పుష్కరాలు జరిగే 2027 జులై నాటికి పోలవరం పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. నిర్వాసితులకు ఏడాదిలోనే రూ.1,900 కోట్లు అందించామని, 2026 నాటికి పునరావాస కాలనీలు పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా రూ.3,870 కోట్లతో ఏడాదిలో హంద్రీనీవా పనులను పూర్తి చేసి రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని భరోసా ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టును కూడా 2026 జూన్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. దెబ్బతిన్న శ్రీశైలం, ధవళేశ్వరం ప్రాజెక్టుల మరమ్మతులకు ఇప్పటికే నిధులు విడుదల చేశామని వివరించారు. కృష్ణా జలాల పంపిణీపై ప్రస్తుతం చర్చ జరగడానికి జగన్ అసమర్థ పాలనే కారణమని నిమ్మల ఆరోపించారు.



## రెండో విడత భూసమీకరణకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

2లో



## రెండు దశల్లో 'జన గణన'- డిజిటల్ విధానంలో నిర్వహిస్తాం: కేంద్రం

2లో

# ధాన్యం రైతుల సమస్యలకు హెల్ప్‌లైన్ నెం. 1967తో చెక్: నాదెండ్ల

**విజయవాడ, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విజయవాడ కానూరులోని పౌరసరఫరాల భవనంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌తో పాటు, '1967' టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం ఆయన కంట్రోల్ రూమ్ పనితీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1,77,934 మంది రైతుల నుంచి కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు 11.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని వెల్లడించారు. ఇందుకుగాను రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 2,830 కోట్లు జమ చేసినట్లు వివరించారు. ధాన్యం విక్రయ ప్రక్రియలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసేందుకే ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చామన్నారు. రైతులు ధాన్యం రిజిస్ట్రేషన్, టోకెన్ల జారీలో జాప్యం, తూకంలో సమస్యలు, రవాణా, గోనె సంచుల కొరత వంటి ఏ సమస్య ఉన్నా 1967 నంబర్‌కు కాల్ చేయవచ్చని మంత్రి సూచించారు. ఈ హెల్ప్‌లైన్ సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుంది. ఫిర్యాదు చేసే సమయంలో రైతులు తమ ఆధార్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, టోకెన్ నంబర్, గ్రామ వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు.




పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY / తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## 'భోపాల్' పాఠాలు నేర్చామా?

భారత పారిశ్రామిక చరిత్రలో మరచిపోలేని విషాద ఘటన భోపాల్ దుర్ఘటన. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ కక్కిన విషంతో భోపాల్ మృత్యునగరంగా, శవాల దిబ్బగా మారి 41 ఏళ్లు గడిచిపోయాయి. అది డిసెంబర్ 3వ తేదీ, 1984వ సంవత్సరం. ఇంకా తెల్లవారలేదు. మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ నగరం. అమెరికాకు చెందిన అతి పెద్ద బహుళజాతి కంపెనీ యూనియన్ కార్బైడ్ కంపెనీ (యు.సి.సి) నుండి మిథేల్ ఐసోసైనేట్ (ఎం.ఐ.సి.-మిక్) అనే 41 టన్నుల విషపూరిత రసాయన వాయువు ఒక స్టోరేజ్ ట్యాంకు నుండి నిద్రిస్తున్న నగరమంతటా వ్యాపించింది. 2,500 మంది అప్పటికప్పుడే మరణించగా క్రమంగా మృతుల సంఖ్య 22 వేల మందికి చేరింది. దాదాపు అయిదు లక్షల యాభై వేల మంది ప్రజలు తీవ్రమైన ప్రభావానికి గురయ్యారు. వందలాది మంది శాశ్వతంగా వికలాంగులయ్యారు. గర్భిణీ స్త్రీలు మృత శిశువులను ప్రసవించారు. 15 వేల పశువులు, ఇంకా వేల సంఖ్యలో పక్షులు కూడా చనిపోయాయి. ఈ విష వాయువు వల్ల సంభవించే దీర్ఘకాలిక ప్రభావాల వల్ల నేటికీ ప్రజలు వైద్యం చేయించుకోవాల్సి వస్తున్నది. ఈ దారుణమైన దుర్ఘటనకు కారకులెవరు? నిందితులను శిక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందా? బాధ్యులకు శిక్ష పడిందా? భోపాల్ ప్రజలకు తగిన విధంగా నష్టపరిహారం ఇచ్చారా? వారి వైద్య ఖర్చులు చెల్లించారా? ఇలాంటివి జరగకుండా అడ్డుకునేందుకు, జవాబుదారీతనం కల్పించేందుకు భారత ప్రభుత్వం గుణపాఠాలు తీసుకుందా? వీటన్నింటికీ ఒకే ఒక విషాదకరమైన సమాధానం 'లేదు' అని మాత్రమే. అణు ప్రమాదాల చరిత్రలోనే అతి పెద్దదైన ప్రమాదం జపాన్‌లోని ఫుకుషిమా ఘటన. దీని నుండి కూడా మన పాలకులు ఎటువంటి పాఠం నేర్చుకోలేదు. దీనికి మరో నిదర్శనం మన దేశంలో అణు ప్రమాదాలు సంభవించినప్పుడు అమెరికా కంపెనీలు బాధితులకు పరిహారం చెల్లింపు నుండి మినహాయింపు ఇవ్వటం. భోపాల్ ప్లాంట్‌లో భద్రతా చర్యలు లేవనే సమస్యను ఆ ప్లాంట్‌లోని కార్మిక సంఘాలు పదే పదే లేవనెత్తాయి. వాటిని యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ చివరకు బాధపడిందెవరు? కార్మికులు, భోపాల్‌లోని పేదలు మాత్రమే. ప్లాంట్ చుట్టూ ఉన్న కార్మికుల కాలనీలు, పేదల బస్తీలు, మురికివాడల్లో నివసించేవారే ఎక్కువగా నష్టపోయారు. అందువల్ల న్యాయం కోసం జరిగిన ఈ పోరాటం కూడా దోపిడీ చేసేవారికి, బహుళజాతి కంపెనీల అత్యాశకు, ప్రభుత్వంలోని వారి మద్దతుదార్లకు వ్యతిరేకంగా దోపిడీకి గురౌతున్న పేదలు జరిపిన పోరాటమే. ఈ మొత్తం విషాద గాథ కొన్ని కఠోర సత్యాలను మన ముందుంచాయి. యుపిఎ, ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వాలు అమెరికా, భారత బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడుతూ వచ్చాయనేది మొదటిది. న్యాయ వ్యవస్థలో కూడా ఈ వర్గ పక్షపాతం ప్రతిబింబించింది. ఇక రెండవ సత్యం మరణించిన 22 వేల మంది, గాయపడిన లక్షలాది మంది ప్రజలు పేదవారే.ప్రపంచంలో ఎక్కడా ఎవరూ ఉపయోగించ వీలులేని అధ్వాన్నమైన టెక్నాలజీని భోపాల్‌లో వాడినట్లు గ్యాస్ దుర్ఘటన సంభవించే వరకూ తెలియదు. ఇప్పటికీ భోపాల్ యు.సి.సి. ప్లాంట్‌లో వేలాది టన్నుల విషపూరిత పదార్థాలున్నాయి. ఆ విషపూరిత వ్యర్థాలు తీవ్ర పరిణామాలతో భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. వీటిని సక్రమంగా నిల్వ చేయకపోవడం వల్ల ప్రమాదం కొనసాగుతూనే ఉంది. కార్పొరేట్, ఎం.ఎన్.సి. శక్తివంత కంపెనీలు తమ చేష్టల వల్ల ప్రస్తుత తరంపైనా, రేపటి తరాలపైనా చూపే ప్రభావాల గురించి పట్టించుకోవు. తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు ఆర్జించే ఏక సూత్ర కార్యక్రమం వారిది. కాబట్టి మన దేశంలో పరిహారాలకు సంబంధించి కఠినమైన చట్టాలు తేవాలి. భోపాల్ దుర్ఘటనను ఎన్నడూ మరచిపోరాదు. దీనికి కారకులైనవారిని బోనులో నిలబెట్టాలి. యు.సి.సి.ని చేపట్టిన నేటి డోవ్ కెమికల్ లేదా కేంద్ర, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు భోపాల్ ప్లాంట్‌లోని వ్యర్థ పదార్థాలను తొలగించే బాధ్యత చేపట్టాలి. నష్ట పరిహారం పెంచాలి. బాధితుల కోసం సక్రమమైన వైద్య వ్యవస్థను ఏర్పాటుచేసి వారికి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి. ఒక స్వతంత్రమైన, స్వయం పాలకమైన అణు భద్రతా నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలి. భోపాల్ దుర్ఘటన నుండి గుణపాఠం నేర్చుకోకపోతే భవిష్యత్ తరాలు పాలక వర్గాలను క్షమించవు.

## రెండో విడత భూసమీకరణకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపి రాజధాని అమరావతిలో రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఏడు గ్రామాల్లో 16,666.57 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమి సమీకరణ బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని వైకుంఠపురంలో 1,965 ఎకరాలు, పెద్దమద్దూరులో 1,018 ఎకరాల పట్టా, యండ్రాయి గ్రామ పరిధిలో 1,879 ఎకరాల పట్టా, 46 ఎకరాల అసైన్డ్ భూమి.. కర్లపూడి లేమల్లెలో 2,603 ఎకరాల పట్టా భూమి, 51 ఎకరాల అసైన్డ్ భూమిని సమీకరించనున్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని హరిశ్చంద్రపురంలో 1,448.09 ఎకరాల పట్టా, 2.29 ఎకరాల అసైన్డ్, పెదపరిమిలో 5,886.18 ఎకరాల పట్టా మరో గ్రామం కలిపి మొత్తం 7 గ్రామాల్లో 16,562.52 ఎకరాల పట్టా భూములు, 104.01 ఎకరాల అసైన్డ్‌భూముల్ని సమీకరించాలని సీఆర్డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ భూసమీకరణలో 3,828.30 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉంది.

## పవన్ 'దిష్టి' వ్యాఖ్యలపై పొన్నం ఫైర్



**దీళిసఎవ పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన 'దిష్టి' వ్యాఖ్యలపై తెలంగాణ ఐటీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి రెండు రాష్ట్రాల మధ్య సౌహార్ద వాతావరణాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. మంగళవారం హుస్నాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి తెలంగాణ ప్రజల దిష్టి తగలడమే కారణమంటూ పవన్ కల్యాణ్ చేసినట్లుగా చెబుతున్న వ్యాఖ్యలపై పొన్నం తీవ్రంగా స్పందించారు. "మీ సముద్రం నుంచి వచ్చే తుపాను మా రాష్ట్రాన్ని ముంచేస్తున్నా మేమెవరినీ తప్పుబట్టలేదు. అది ప్రకృతి అని భావించాం. కానీ డిప్యూటీ సీఎం స్థాయిలో ఉండి ఇలాంటి మాటలు మాట్లాడతారా? కోనసీమపై మేమెందుకు దిష్టి పెడతాం?" అని ఆయన నిలదీశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అన్నదమ్ముల్లాంటివని, ఇలాంటి వ్యాఖ్యలు ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య అగాధాన్ని సృష్టిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తులో ఉన్న ప్రభుత్వ ప్రతినిధి ఇలా మాట్లాడటం బాధాకరమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ నాయకత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

## సమయపాలన పాటించని మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలి



**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక నియోజకవర్గంలో అనధికారికంగా బెల్ట్ షాపులు నడిపిస్తున్న బెల్ట్ షాపులను తొలగించాలని సమయపాలన పాటించకుండా నిర్వహిస్తున్న మద్యం బారుషాపుల లైసెన్సులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కె. వన జాక్షి అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె అచ్యుత రావు డిమాండ్ చేశారు. మంగళవారం గాజువాక ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐ సిహెచ్. నాగ శ్రీనివాస్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బెల్ట్ షాపులో ఉదయం రాత్రి అని తేడా లేకుండా మద్యం దొరకడం వలన కుటుంబాలు, జీవితాలు నాశనం అవుతున్నాయి. ఇది కాకుండా వీధి ఒక మద్యం షాపులు లైసెన్సులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. బార్ మద్యం షాపులు సమయం పాలన లేకుండా తెరుస్తూ రాత్రి 12 గంటల వరకు నడిపిస్తున్నారు. ఉదయాన్నే బ్లాక్ మార్కెట్ తరహాలో షట్టర్ మోసి వేయించి ఉన్నా మద్యాన్ని అమ్ముతున్నారు. మద్యం షాపుల్లో మద్యాన్ని కల్తీ చేసే సంఘటనలు కూడా రాష్ట్రంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. మద్యం సమయపాలన లేకుండా దొరకడం వలన మహిళలు కు రక్షణ కరువుతుంది. మద్యం షాపులు దగ్గర మందుబాబులు రోడ్లు పైకి వచ్చి అటువైపు వెళ్లే పాదచర్లకు ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కల్తీ మద్యాన్ని అరికట్టాలిని, బెల్ట్ షాపుల్ని తొలగించాలని, మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకే అమ్మేలా, సమయపాలన పాటించకుండా నిర్వహిస్తున్న బార్ మద్యం షాపులు లైసెన్సులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐ మీరు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేస్తామని రోడ్డుపైకి వచ్చే మందుబాబులను ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని అన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.పద్మ జి. ఓంకార్ పాల్గొన్నారు.

## రెండు దశల్లో 'జన గణన'- డిజిటల్ విధానంలో నిర్వహిస్తాం: కేంద్రం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలో జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2026 ఏప్రిల్- సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జన గణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నకు, హోమ్ వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇస్తూ, జన గణన గురించి తెలిపారు. జన గణన మొదటి దశలో హౌస్ లిస్టింగ్, సెన్సెస్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. 'మొదటి దశ జన గణన 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరుగుతుంది. అయితే ఆయా రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యానికి అనుగుణంగా 30 రోజుల వ్యవధిలోనే సెన్సెస్ నిర్వహణ ఉంటుందని' నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. "జన గణన 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 మధ్యలో జరుగుతుంది. అయితే లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కప్పపడే నాన్-సింక్రోనస్ ప్రాంతాల్లో జన గణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 మధ్య జరుగుతుంది" అని నిత్యానంద్ రాయ్ లోక్‌సభకు తెలిపారు. ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్లు మంత్రి నిత్యానంద్ రాయ్? చెప్పారు. మన దేశంలో జన గణనకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని, ఇంతకు ముందు నిర్వహించిన జనాభా లెక్కల నుంచి నేర్చుకున్న పాఠాలను తదుపరి జన గణన కోసం పరిగణనలోకి తీసుకుంటామని ఆయన అన్నారు. మరో ప్రశ్నకు సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగా, కుల గణన కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్ రాయ్? లోక్‌సభకు తెలిపారు. మరో ప్రశ్నకు జవాబిస్తూ, 2027 జనాభా లెక్కింపు డిజిటల్ వేలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొబైల్ యాప్?ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. డిజిటల్ విధానంతో జనాభా లెక్కించేందుకు అధికారులతోపాటు ప్రజలకూ అవకాశం ఇవ్వనున్నారు. ఇంతకు మునుపే రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం పౌరులను అడగడానికి దాదాపు 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఈ సర్వేలో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, లైటింగ్, మరుగుదొడ్ల వాడకం, స్నానం, వంటగది సౌకర్యాలు, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఎల్పీజీ/పీఎన్జీ కనెక్షన్ గురించి కూడా అడుగుతారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ఉపయోగించిన మెటీరియల్, నివాసితుల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి. మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. ఆ తర్వాత కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణన నిలిచిపోయింది. త్వరలో చేపట్టనున్నది 16వ జనాభా గణన. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత లెక్కవేసుకుంటే ఇది 8వది అవుతుంది.

## అభివృద్ధి పనులపై పల్లా సమీక్ష




**గాజువాక, పతాకం న్యూస్:** శంకుస్థాపన చేసిన ప్రతీ పని త్వరగా పూర్తి అవ్వాలని రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మంగళవారం గాజువాక టీడీపీ క్యాంపు ఆఫీస్ లో జీవీఎంసీ అధికారులతో గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలో వున్న అన్ని ప్రధాన రహదారులు మరమ్మత్తులకు చేసిన శంకుస్థాపన పనులను వెంటనే ప్రారంభించాలని అన్నారు. రహదారుల విస్తరణలో భూములు కోల్పోయిన వారికి తక్షణమే టీడీఆర్ లను మంజూరు చేయాలనీ ఆదేశించారు. కూర్మన్నపాలెం దువ్వాడ ప్రధాన రహదారి పనులు, బీసీ రోడ్డు నుండి పెదగంట్యాడ సర్వీస్ రోడ్డు వరకు, గంగవరం ప్రధాన రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలనీ ఆదేశించారు. ఏడాది క్రితం వంటిల్లు వద్ద శంకుస్థాపన చేసిన పనులు ఇప్పటికి పూర్తికాకపోవడం తో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓల్డ్ గాజువాక ని గోల్డ్ గాజువాకగా మార్చడమే నా లక్ష్యం అని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.సమావేశంలో జోనల్ కమీషనర్ శేషాద్రి, ఈఈ రాయల్ బాబు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకట రావు, డీ ఈ నారాయణ రావు, ఏఈ శివ, నియోజకవర్గం సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్, 87వ వార్డు కార్పొరేటర్ బోండా జగన్ పాల్గొన్నారు.

## ప్రకృతి పంటల మేళాకు తరలి రండి

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రకృతి వ్యవసాయ రైతుల పంటల మేళాకు తరలి రావాలని భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం విశాఖపట్నం లోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ నెలలో 4 నుండి 7 వ తేదీ వరకు నిర్వహించె మేళాను ప్రారంభించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విచ్చేస్తున్నారు అని పేర్కొన్నారు. ఆరవ తేదీ ఎం ఎస్ ఎం ఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు వస్తున్నారన్నారు. ఈ మేళాను ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, వారాహి ఫెడరేషన్, హలో వైజాగ్, టెర్రస్ గార్డెన్ గ్రూప్ లు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ, అగ్రి డిఎన్ఎ వెంచర్స్ సంస్థల నేతృత్వంలో ఈ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కార్యదర్శి పాలెం నేచురల్స్ అశోక్, ప్రకృతి రైతులు రిషీ, ఎన్ నరేంద్ర, పర్యావరణ ప్రముఖ్ రంగాచార్యులు, యోగ భారతి ప్రతినిధి పైడం నాయుడు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితర ప్రకృతి రైతులు పాల్గొన్నారు.

# ఈ ఏడాది విశాఖలో నేవీ డే లేనట్టే!



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నేవీ డే సందర్భంగా తూర్పు నౌకాదళం ప్రతి ఏటా డిసెంబరు 4వ తేదీ సాయంత్రం రామకృష్ణా బీచ్‌లో నిర్వహించే సాహస విన్యాసాల ప్రదర్శన ఈ ఏడాది కనిపించే అవకాశం లేదు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు, రిహార్సల్లు పూర్తయ్యేవి. విశాఖ గగన వీధుల్లో యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టాల్సిన సమయం. కానీ ఈసారి వాటి జాడ లేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 25 వరకు విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్-2026ను భారీఎత్తున నిర్వహించడానికి నేవీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


భారత రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి, తదితర ప్రముఖులు హాజరవుతారు. ఇందులో సుమారు 50 దేశాలకు పైగా పాల్గొంటాయి. ఇవి అతి పెద్ద కార్యక్రమాలు కావడం, అప్పుడు కూడా ఆర్‌కే బీచ్‌లో నేవీ సాహస విన్యాసాలు నిర్వహించాల్సి ఉండడంతో తాజాగా నేవీ డే నిర్వహించడం లేదని తెలిసింది. గత ఏడాది ఒడిశాలోని పూరి తీరంలో నేవీ డే నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ తరువాత జనవరి 4న విశాఖలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలిసి హాజరయ్యారు.

## దొంగతనాల పట్ల రైతు బజార్‌లో అవగాహన కల్పించిన ఎంవీపీ పోలీసులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలోని ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో రైతులకు, వినియోగ దారులకు దొంగతనాలపై ఎంవిపి పోలీస్ స్టేషన్ ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రైతుబజార్‌లో దొంగతనాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు, వినియోగదారులకు అవగాహనా కల్పించారు. వినియోగదారులు కూరగాయలు, పండ్లు కొనేటప్పుడు వారి విలువైన వస్తువులు, సెల్ ఫోన్లు, మనీ పర్సులు జాగ్రత్త గా భద్రపర్చు కోవాలని తెలియ చేసారు. జేబు దొంగలుంటారు జాగ్రత్త అని వాలు పోస్టర్స్ ను రైతుబజార్ లోపల గేట్లకి, గోడలకి అంటించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో ఎంవిపి పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరావు రైతుబజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకుడు కనకరాజు, రైస్ కౌంటర్ మురళి, రైతుబజార్ రైతులు, వినియోగ దారులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరాపల్లి మండల తెదేపా మహిళా అధ్యక్షురాలుగా 'కర్రి పుష్ప దేముళ్ళు'



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** నాగయ్యపేట సర్పంచ్ గా గ్రామ స్థాయి నుండి మండల పార్టీ మహిళా నాయకరాలుగా ఎదిగిన తీరు గౌరవం అది అంతా ప్రజలు ఇచ్చిన కీర్తి, నన్ను నమ్మి మంత్రి నారా లోకేష్ ఇచ్చిన పదివికి న్యాయం చేస్తా అని అన్నారు ఈ సందర్భంగా దేవరాపల్లి మండల తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలుగా 'కర్రి పుష్ప దేముళ్ళు' నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఇ పదవికి అర్హ రాలుగా నన్ను నమ్మి ఇచ్చిన పదివిని ఓమ్ము చేయకుండా అందిరి సహకారంతో వెళ్తానని,పార్టీ పెద్దలు మరియు మండల నాయకలు ,రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రునాయుడు,దేవరాపల్లి మాజీ ఎంపీపీ జనరల్ సెక్రటరీ దొగ్గ దేముడు నాయుడు, మాడుగుల నియోజకవర్గం బీసీసెల్ కర్రి సింహాద్రి నాయుడు,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ మరియు మండల నాయకులు అందరుతో పార్టీ అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తానని, కార్యకర్తలను, నాయకులు కలుపుకుంటూ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేద, బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు, మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తానని ఆమె స్పష్టం చేశారు. ఇ తెలుగుదేశం పార్టీలో దేవరపల్లి మండల మహిళా అధ్యక్షురాలుగా నన్ను గుర్తించి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.అని మీడియాతో కర్రి దేముళ్ళు పుష్ప అన్నారు

## మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణ పై వైసీపీ కోటి సంతకాల సేకరణ విజయవంతం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం రాష్ట్రం లో ఉన్న మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణ చెయ్యాలి అనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు అనకాపల్లి నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయ కర్త మాలసాల భరత్ కుమార్ ఆదేశాలతో గత వారం రోజులు గా 81 వ జీవీఎంసీ వార్డ్ లో రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతం గా జరిగింది. సంతకాల పుస్తకాలన్ని నియోజకవర్గ వర్గ సమన్వయ కర్త మలశాల భరత్ కి పార్టీ సీనియర్ నాయకులు సుంకర వెంకటేశ్వర రావు చేతుల మీదుగా భరత్ కి బొడ్డెడ శివ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మలసాల భరత్ మాట్లాడుతూ నియోజక వర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చాలా చక్కగా జరిగిందని ప్రజలు విద్యార్థులు విశేషం గా స్పందించి సంతకాలు చేశారు అని అన్నారు. 81 వ వార్డ్ లో బొడ్డెడ శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు ను అభినందించారు. ఈ కార్యక్రమం లో వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, 80 వ వార్డ్ ఇంచార్జ్ కె. ఎం. నాయుడు, బుద్ధ జగన్, కాండ్రేగుల వెంకట సాంబ శివ, రాపేటి మహాలక్ష్మీ నాయుడు, పెంట కోట సంతోష్, పట్టణ కార్యదర్శి వాసుపల్లి తాతీయలు, కొణతాల గోవింద్, కొణతాల త్రినాథ్, కొణతాల రాముడు, రాపేటి సునీల్, నిరీక్షణ్, వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## తామరబ్బ యూపీ స్కూల్‌కు ఉపాధ్యాయుల కొరతను నివారించాలి



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** దేవరాపల్లి మండలం తామరబ్బ యుపి స్కూల్ కు అదనంగా ఉపాద్యాయులను నియ మించాలని డిఇఓ అప్పారావు నాయుడు మంగళవారం దేవరాపల్లి పర్యాటనకు వచ్చిన సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న కోరారు, దేవరాపల్లి మండలం తామరబ్బ పంచాయతీ యుపి స్కూల్ ను పరిశీలించి పిజిఆర్ఎస్ లో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసాము అని అన్నారు. స్కూల్ లో 52 మంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు వీళ్ళ అంతా ఆదివాసీ గిరిజన,తేగలకు చేందిన వారు అత్యదిక మంది ఉన్నారని అన్నారు సిపిఎం నాయకులు అన్నారు.1 నుండి 5 వరకు 30 మంది వరకు పిల్లలు ఉన్నారని 6,7,8 తరగతి వరకు 22 మంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారని తెలిపారు ఈ 20 మందికి ఇంగ్లీషు లెక్కలకు మాత్రమే ఉపాద్యాయులు ఉన్నారని అన్నారు, తెలుగు హిందీ, సోషల్, సైన్స్ సబ్జెక్టులకు ఉపాద్యాయులు లెరన్నారు ఇద్దరు టిచర్లు 18 క్లాసులు చెబుతున్నారని, దీని వలన గిరిజన విద్యార్ధిని విద్యార్థులు తీవ్ర మైన ఇబ్బందులు పడుతూ చదువులకు దూరం అవుతున్నా సంద%శీ%ర్భాలు ఉన్నాయి అని ఆవేదన వ్యక్తం చేసారు.గిరిజన విద్యార్ధిని విద్యార్థులు సమస్యలు ద్రుష్టిలో పెట్టుకుని ఉపాద్యాయులు సమస్య పరిష్కారం చేయాలి అని డి ఇ ఓ ను కోరారు. సాను కూలంగా స్పందించిన %ణజూ% తప్పని సరిగా ఉపాద్యాయులు కొరత పై చర్యలు తీసుకోని దగ్గరుండి ఉపాధ్యాయుల విషయములు ప్రభుత్వానికి నివేదిక తయారు చేసి కలెక్టర్ గారికి ఇవ్వటం జరుగుతుందని డిఇఓ హామీ ఇచ్చారు అంట.సిపిఎం నాయకులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'ఉక్కు' ప్రమాదంపై ఫోరెన్సిక్ తనిఖీలు



**గాజువాక, పతాకం న్యూస్:** స్టీల్‌ప్లాంటులో బ్లాస్ట్ ఫర్నేస్‌కు రా మెటీరియల్ సరఫరా చేసే కన్వేయర్ బెల్ట్ తెగిపోయిన ఘటనపై విశాఖపట్నం సిటీ పోలీసులు ఫోరెన్సిక్ నిపుణులతో వెళ్లి పరిశోధన చేశారు. బెల్ట్ తెగిపోవడానికి అసలైన కారణాలు ఏమిటో గుర్తించడానికి అందుబాటులో ఉన్న అన్నిరకాల సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుంటామని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వెల్లడించారు. ఇటీవల స్టీల్‌ప్లాంటులో నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో కన్వేయర్ బెల్ట్‌లు తరచూ తెగిపోతున్న సంగతి తెలిసిందే. ఉద్యోగులే కావాలని వాటిని కోసేస్తున్నారని యాజమాన్యం అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో నవంబరు 25న బీఎఫ్-3కి ముడి పదార్థాలు సరఫరా చేసే ఎంబీ-2 కన్వేయర్ బెల్టు తెగిపోయింది. దీనివల్ల ఆ బీఎఫ్‌లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న యాజమాన్యం 28న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీస్ కమిషనర్ విచారణకు వెళ్లారు. అప్పుడు ప్లాంటు పర్యటనలో ఉన్న స్టీల్ జాయింట్ సెక్రటరీలు, సీఎండీ సక్సేనాతో కలసి ఘటనా స్థలాన్ని సందర్శించారు. పూరిస్థాయిలో దర్యాప్తు చేస్తామని వెల్లడించారు. కన్వేయర్ బెల్ట్‌లకు, వాటివల్ల ప్లాంటుకు జరుగుతున్న నష్టంపై సీఎండీ సక్సేనా ప్రత్యేక కమిటీ వేశారు. వారిని సమన్వయం చేసుకుంటూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్లాంటులో చాలాచోట్ల సీసీ టీవీ కెమెరాలున్నాయి. కన్వేయర్ బెల్ట్‌లు తెగిపోతుండడంతో ప్రత్యేక విభాగాల్లో మరిన్ని సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు. దాంతో యాజమాన్యం ఏర్పాట్లలో నిమగ్నమైంది. అంతేకాకుండా ప్లాంటులో విధులకు వచ్చే ప్రతి ఒక్కరు యాజమాన్యం జారీ చేసిన ఐడీ కార్డును(ఒరిజినల్) ధరించాలని ఆదేశించింది. కొందరు కలర్ జెరాక్స్ కాపీలు లామినేషన్ చేయించి వినియోగిస్తున్నారని, వాటిని అనుమతించమని స్పష్టంచేసింది.

## 'నర్సీపట్నం' అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం నియోజకవర్గంలో ఏటా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నట్టు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మండలంలోని డి.యర్రవరంలో రూ.2 కోట్లతో నిర్మించిన బాలికల వసతిగృహాన్ని, రూ.23 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని అధికారులతో కలసి ప్రారంభించారు అనంతరం ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడుతూ, అభివృద్ధి విషయంలో నర్సీపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. తాండవ-నాతవరం రోడ్డుకు రూ.3.5 కోట్లు మంజూరయ్యాయని, వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.4 వేలకు తగ్గకుండా పింఛన్ ఇస్తున్నామని ఆయన చెప్పారు. నాతవరం-గొలుగొండ మండలాలను కలిపే రోడ్డుకు తాండవ డ్యామ్ వద్ద రక్షణగోడ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తున్నదని, పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. అంతకుముందు గ్రామంలో పలువురి ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ డబ్బులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ నాయకులు నందిపల్లి వెంకటరమణ, ఎన్.విజయ్‌కుమార్, వెలగా వెంకటకృష్ణారావు, ఇనపసప్పల సత్యవతి, చింతంరెడ్డి బెన్నయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## 6న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల ఆరోతేదీని నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని కార్యదర్శి బీవీరమణను ఆదేశించారు. ఇప్పటివరకు 230 ప్రతిపాదనలు అజెండాలో చేర్చినట్టు తెలిసింది. శుక్రవారం వరకు ప్రతిపాదనలు స్వీకరించే అవకాశం ఉండడంతో అజెండాలో 300కిపైగా అంశాలుంటాయని భావిస్తున్నారు. కార్యదర్శి పేషీకి అందిన అంశా ల్లో యోగాంధ్రకు సంబంధించిన పనులకు బిల్లు చెల్లింపు అంశాలే ఎక్కువగా ఉన్నట్టు తెలిసింది.

## రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ డిఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు



**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ కె.వి జ్యోతి ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. అలాగే రోలుగుంట పీహెచ్సీ లో ఆశ డే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ప్రాముఖ్యత, తల్లి బిడ్డ ఆరోగ్యం, పల్స్ పోలియో నివారణ, క్యాన్సర్, లెప్రసీవ్ అంటే వ్యాధుల నివారణ, వైద్యం, బాల్య వివాహాల నిర్మూలన వంటి అనేక అంశాలపై ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి మజీదా బేగం, ఎం పి హెచ్ ఈ ఓ కృష్ణ, గోవిందు, హెచ్ ఎస్ లు షాజహాన్, వరహాలమ్మ, ఆశ వర్కర్లు, ఏఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకాకుళంలో పెరుగుతున్న కాలుష్యం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఉత్తరాంధ్రలో కాలుష్యం పెరుగుతున్న జిల్లాల్లో విశాఖ తరువాత శ్రీకాకుళం ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల ప్రకారం 2017-18తో పోలిస్తే జిల్లాలో 14.5 శాతం కాలుష్యం పెరిగినట్టు స్పష్టమవుతోంది. జల కాలుష్యంతో పాటు వాయు కాలుష్యం అధికంగా ఉంది. ముఖ్యంగా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడ, పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో జీడి పరిశ్రమలు, టెక్కలిలో గ్రానైట్ పరిశ్రమతో కాలుష్యం పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. పైడిభీమవరంలో 450 ఎకరాల్లో ఉన్న భారీ పారిశ్రామికవాడ కాలుష్యానికి కేరాఫ్‌గా మారుతోంది. ఇక్కడ 275 ఎకరాల్లో రసాయనిక జోన్ ఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 13 రసాయన పరిశ్రమలు కొనసాగుతున్నాయి. పారిశ్రామికవాడ నుంచి వెలువడే రసాయన వ్యర్థాలతో సమీపంలోని కందివలస గెడ్డ పూర్తిగా కలుషితమైంది. ఆ నీరు సాగుకు, పశువులు తాగేందుకు పనికిరాదు. భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. పరిసర గ్రామాల ప్రజలు అనేక రుగ్మతల బారిన పడుతున్నారు. జిల్లా మీదుగా సుదీర్ఘ జాతీయ రహదారి ఉంది. పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకూ 197 కిలోమీటర్ల పాటు విస్తరించి ఉంది. ఆపై అంతర్ రాష్ట్ర, జిల్లా రహదారులు ఉన్నాయి. దీంతో వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది. జిల్లాలో 20 లక్షల వరకూ వాహనాలు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అందులో ఐదు లక్షలకుపైగా కాలం చెల్లినవే. దీంతో వాటి నుంచి వెలువడే పొగతో వాయుకాలుష్యం పెరుగుతోంది. జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలస మునిసిపాలిటీలు ఉన్నాయి. ఆపై పెద్ద పెద్ద పట్టణాలు ఉన్నాయి. ఆయా చోట్ల విరివిగా చెట్లు నాటితే చాలా మంచిది. అలాగే వాహనాల వినియోగాన్ని తగ్గించాలి. ప్రజారవాణాకు సంబంధించి గ్రీన్ ఎనర్జీ వెహికల్స్‌ను మాత్రమే వినియోగించడం ఉత్తమం. కాలం చెల్లిన వాహనాలను నిర్వీర్యం చేయాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి. నీటిని పొదుపుగా వాడడం ద్వారా జల కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

### పెంచలయ్య హత్యకు నిరసనగా
## నెల్లూరు జిల్లాలో బంద్



**నెల్లూరు, పతాకం న్యూస్:** ప్రజానాట్యమండలి నెల్లూరు రూరల్ కార్యదర్శి, సిపిఎం కార్యకర్త పెంచలయ్య హత్యను నిరసిస్తూ నెల్లూరు నగరంలో సిపిఎం, అనుబంధ సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బంద్ ప్రశాంతంగా సాగుతోంది. స్థానిక గాంధీ బొమ్మ వద్ద గంజాయి డ్రగ్స్, మహమ్మారి దిష్టిబొమ్మను సిపిఎం నేతలు కార్యకర్తలు దహనం చేశారు. గంజాయిని తరిమికొట్టాలని ఈ సందర్భంగా వారి పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలో పలు స్కూల్స్ యాజమాన్యాలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాయి. సిపిఎం పిలుపు మేరకు జరుగుతున్న ఈ బంద్‌కు వైసిపి, టిడిపి, సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఎంఎల్ న్యూడ్రెమొక్రసీ, బిఎస్‌పి, ఇసికె, ఎంఆర్‌పిఎస్‌తో పాటు దళిత సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. నెల్లూరులో స్థానిక గాంధీబొమ్మ నుంచి విఆర్‌సి, మద్రాసు బస్టాండ్ మీదుగా ఆర్‌టిసి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. బంద్ లో సిపిఎం ,సిపిఐ, సిపిఎంఎల్ ,న్యూ డెమోక్రసీ, తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు. వైసిపి, టిడిపి నాయకులు పాల్గొనకుండా మద్దతు ప్రకటించారు. సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసుని అరెస్ట్ చేసి, వెంటనే విడుదల చేశారు. స్కూల్లు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ



**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక నియోజకవర్గం 87వ వార్డు పరిధి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఉదయం స్నాక్స్ పంపిణి చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) పాల్గొని స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు మంచి విద్య, క్రీడల పట్ల నైపుణ్యత కనపరచినవరికి ఆదరణ మరియు ఆహారం అందించడంలో శ్రద్ధ చూపిస్తుందని అందులో భాగంగా ఉదయం పిల్లలకు వారంలో మూడు రోజులు స్నాక్స్ అందిస్తారని ఇంత మంచి ఆలోచన ఆనందకరమైనది అని కూటమి ప్రభుత్వం అభివృద్దే కాకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుతుందని అన్నారు. అనంతరం క్రీడలలో ప్రతిభ చూపినవారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోగంటి లెనిన్ బాబు, కాండ్రేగుల శ్రీనివాసనాయుడు, జాన్ రమేష్,పోతల కృష్ణ,అప్పలనాయుడు, ఆదినారాయణ, దాలయ్య, ఏటీఎన్ మూర్తి, సుందర్ సునీల్, హెచ్ఎం , ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గంగవరం మండలం పాస్టర్ అసోసియేషన్ గ్రాండ్ ఐక్య క్రిస్టమస్ సెలబ్రేషన్



**రంపచోడవరం, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజవర్గం గంగవరం మండలం గంగవరంలో జర్నీ ఫెలోషిప్ చర్చ్ గ్రౌండ్ ఆవరణంలో గ్రాండ్ క్రిస్టమస్ సెలబ్రేషన్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే శిరీష దేవి.క్రిష్టమస్ శుభకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఐక్య క్రిష్టమస్ వేడుకల్లో ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ఆదర్శనీయం యేసు క్రీస్తు సర్వమానవాళి పాప పరిహారార్థం ఈ లోకంలో మానవ రూపంలో జన్మించిన శుభదినమే క్రిష్టమస్ అని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. గంగవరం మండల పాస్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సంతోష్ అధ్యక్షతన సోమవారం గ్రాండ్ ఐక్య క్రిష్టమస్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆమెకు ఘన స్వాగతం పలికి సత్కారం చేశారు. ఈ సందర్భంగా. సేవకులు కూడా సమాజానికి ఉపయోగపడేలా మంచి కార్యక్రమాలు చేయాలని సూచించారు. అందరికీ క్రిష్టమస్ శుభాలు తెలిపారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో బ్రదర్ అనిల్ కుమార్ వాక్య సందేశం తో అందరినీ ఏసుక్రీస్తు జననం గురించి వివరిస్తూ ఏసుక్రీస్తు జననం ఒక మతము కాదు ఆయన జననం సర్వ మానవులకు శుభదినం దొంగలను త్రాగుబోతులను వ్యభిచారులను నరహంతకులను వారి బ్రతుకులను ప్రభుత్వాలు గాని ఎవ్వరూ మార్చలేనిది ఏసుప్రభు సత్యమార్గం వారి బ్రతుకుని మార్చింది అని సందేశం ఇచ్చారు ఈ కార్యక్రమానికి బిషప్ డానియల్ పాల్.గంగవరం మండల దైవసేవకులు.స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ, జడ్పీటీసీ బేబీ రత్నం, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, సేవకులు. విశ్వాసులు అభిమానులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### డొంకరాయి నుంచి
## నీటి విడుదల నిలిపివేత



**సీలేరు, పతాకం న్యూస్:** సీలేరు కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటిని సరఫరా చేసే డొంకరాయి పవర్ కెనాల్ నుంచి నీటి విడుదలను రెండు నెలల పాటు నిలిపివేస్తున్నట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 115 మెగావాట్ల సామర్థ్యం (ఒక్కొక్కటి) గల 5, 6 రెండు యూనిట్లకు కమిషనింగ్ పనుల్లో భాగంగా ఆ రెండు యూనిట్లకు ఫోర్‌బే డ్యాం నుంచి పెన్‌స్టాక్ పైప్‌లైన్ ద్వారా నీరు పంపడానికి అవసరమైన వాటర్ కండక్టర్ సిస్టంను ఫోర్‌బే ఇంటెక్ వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనులు చేయాలంటూ డొంకరాయి పవర్ కెనాల్ నుంచి వచ్చే నీటి విడుదలను పూర్తిగా నిలిపివేయాలని ఆయన తెలిపారు. దీని కోసం డిసెంబరు 2 నుంచి రెండు నెలల పాటు నీరు నిలిపివేతకు ఏపీ జెన్‌కో గ్రిడ్ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకున్నామన్నారు. ఈ రెండు నెలల పాటు 460 మెగావాట్ల సామర్థ్యం గల పొల్లూరు, 25 మెగావాట్ల సామర్థ్యం గల డొంకరాయి జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని నిలిపివేయనున్నట్టు ఆయన చెప్పారు. అలాగే ఈ షట్‌డౌన్ సమయంలో పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో గల 115 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్లకు కొన్ని ఆపరేషన్ నిర్వహణ పనులు చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు. అలాగే 25 మెగావాట్ల సామర్థ్యం గల డొంకరాయి మినీ జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్ క్యాపిటల్ ఓవరాయిలింగ్ పనులను కూడా నిర్వహించనున్నామని చెప్పారు. డొంకరాయి నుంచి ఫోర్‌బే వరకు గల 16 కిలోమీటర్ల పవర్ కెనాల్ ఒకటి, రెండు రీచ్‌ల్లో సీపేజీని నిలిపివేయడం కోసం నిర్వహణ పనులను కూడా నిర్వహిస్తున్నామన్నారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలో ఈ రెండు నెలల పాటు విద్యుత్ డిమాండ్, గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు ఎగువ సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతుందని ఆయన చెప్పారు.

## జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం జయప్రదం చేయాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం జయప్రదం చేయాలని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. మంగళవారం విశాఖపట్నం లోని పెద్ద జాలారి పేటలో ఎ ఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులు బీచ్ క్లీనప్ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కాసు నేతృత్వంలో, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లు సుశీల, స్వాతి ల పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో రత్నం మాట్లాడుతూ కాలుష్యం నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వద్దే వద్దు ని పిలుపునిచ్చారు. మన సముద్రాలను మనమే కాపాడుకుందాం అని, సముద్రాలు చెత్త కుండీలు కావని వివరించారు. ఇంటి వద్ద కూరగాయల పంటలు పండించడం ఎలా అనేది వివరించారు.

ఈ కార్యక్రమంలో మిద్దె తోట రైతు అన్నపూర్ణ అవగాహన కల్పించారు, ఏక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ అనకాపల్లి హెచ్ ఆర్ డి ఐ.కృష్ణ కుమారి తదితరులు మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో ఎపి పిసిబి, కోరమాండల్ ఫెర్టలైజర్స్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ లు అందజేసిన గుడ్డ సంచులు విద్యార్థులకు పంపిణీ చేశారు, ఇంటింటికీ వంగ, టమాటా, పచ్చిమిర్చి, పచ్చి మిర్చి మొక్కలు పంపిణీ చేశారు. ఒక్క సారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వద్దే వద్దు అనె నినాదాలతో ఊరేగింపు నిర్వహించారు

## ఏపీలో జనవరి నుంచి రూ.25 లక్షల వైద్య బీమా: మంత్రి అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక శుభవార్తను అందించింది. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ జనవరి నుండి రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక కీలక నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, తమ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. కేవలం తన నియోజకవర్గంలోనే ఇప్పటివరకు సీఎం సహాయనిధి ద్వారా రూ. 2.10 కోట్ల విలువైన సాయాన్ని అందించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో వైద్యం కోసం పేదలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే రూ. 25 లక్షల వరకు వైద్య సహాయం అందించే పథకాన్ని సీఎం చంద్రబాబు తీసుకురానున్నట్లు ఆయన ప్రకటించారు.

## కార్గో ఎయిర్‌పోర్టుపై అపోహవద్దు: ఆర్డీవో



**మందస, పతాకం న్యూస్:** కార్గో ఎయి ర్‌పోర్టు నిర్మాణంపై అపోహలు వద్దని పలాస ఆర్డీవో జి.వెంకటేష్, ఎయిర్‌పోర్టు లీగల్ అడ్వైజర్ ఎం.వెంకటేశ్వర రావు కోరారు. మందస తహసీల్దార్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వెనకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వంఎయిర్‌పోర్టు నిర్మించేందుకు నిర్ణయం తీసుకుందని, దీంతో చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి,ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు.ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో పర్యటించి గ్రామసభలు నిర్వహిస్తామని, దీనివల్ల కలిగే లాభనష్టాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకవరణ జరుగుతుందన్నారు. మెట్టూరు,చీపురుపల్లి, బిడిమి గ్రామాల్లో 95శాతం, మిగతా గ్రామాల్లో 5శాతం ఎయిర్‌పోర్టు నిర్మించనున్నట్లు తెలిపారు. మిగతా ప్రభావిత గ్రామాల్లో గృహాలకు ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. వ్యవసాయభూమి 1000 ఎకరాలు, ప్రభుత్వ భూమి 200 ఎకరాలకుపైగా భూసేకరణకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మందస తహశీల్దార్ మిస్క శ్రీకాంత్, సర్వేయరు బాబూరావు, ఆర్ఐ ఇందిర పాల్గొన్నారు.

## 'పది' ఓపెన్ స్కూల్ కు తత్కాల్ ద్వారా ప్రవేశాలు



**అనకాపల్లి పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా 2025.26 విద్యా సంవత్సరానికి నేరుగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరడానికి తత్కాల్ ద్వారా ప్రభుత్వం మరో అవకాశాన్ని ఇచ్చిందని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నేరుగా 10వ తరగతి లోనికి, పది ఉత్తీర్ణత పొందిన వారు నేరుగా ఇంటర్మీడియట్ లోకి డిసెంబర్ 6 వ తేదీ లోగా తత్కాల్ ద్వారా చేరవచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లాలో ఉన్న అధ్యయన కేంద్రాల ద్వారా 6 వ తేదీ లోగా నమోదు కావాలన్నారు. ఇప్పుడున్న ఫీజులతో పాటు ప్రతీ విద్యార్థి అదనంగా 600 రూపాయలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లాలో ఉన్న అధ్యయన కేంద్రాలు, అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలన్నారు. అలాగే పూర్తి సమాచారానికి ఓపెన్ స్కూల్స్ జిల్లా ఇంచార్జ్ పెనుమత్స కృష్ణంరాజు, ఫోన్ నెంబర్: 8008902915 లో సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు, పరీక్షలు విభాగం సహాయ సంచాలకులు ఏ. శ్రీధర్ రెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు రామలింగేశ్వర రావు పార్వతి, సిసి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలంకలో 367 మంది గల్లంతు



**కొలంబో :** శ్రీలంకలో వినాశకరమైన దిత్వా తుఫాను కారణంగా 367 మంది గల్లంతయ్యారు. భారీ వర్షం, గాలులు, కొండచరియలు విరిగిపడటంతో 366 మంది మరణించారు. రక్షణ, పునరావాస చర్యలు కొనసాగుతున్నాయి. సుమారు 1.5 లక్షల మందిని తరలించారు. బ్రిటన్ మరియు న్యూజిలాండ్ సహాయం అందించడానికి ముందుకు వచ్చాయి. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునరుద్ధరించడానికి ప్రపంచ బ్యాంకు సహాయం కోరనున్నట్లు అధ్యక్షుడు అనుర కుమార దిసానాయకే ప్రకటించారు. 108 రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని రోడ్డు అభివృద్ధి అథారిటీ తెలిపింది. ఆపరేషన్ సాగర్ బంధులో భాగంగా భారతదేశం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళంలోని 80 మంది సభ్యుల బృందాన్ని శ్రీలంకకు పంపింది. కొలంబోలో చిక్కుకున్న 237 మంది భారతీయులను ఐఎఎఫ్ విమానంలో తిరువనంతపురానికి తరలించింది. శ్రీలంకలోని వివిధ ప్రాంతాల్లో చిక్కుకున్న భారతీయులు సహా పర్యాటకులను నేవీ హెలికాప్టర్లలో రక్షించి సురక్షితంగా తరలించారు.

## మరింతగా వణికించే శీతాకాలం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఈ శీతాకాలంలో దేశంలోని పలు ప్రాంతాలు మరింత చలితో వణికిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 'చలిగాలి రోజులు' సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, తూర్పు యూపీ, ఉత్తర మధ్యప్రదేశ్, పడమటి మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్‌లలో ఈ ప్రభావం ఎక్కువ ఉండనున్నదని తెలిపింది. చలి గాలుల నిర్వచనాన్ని కూడా ఐఎండీ స్పష్టం చేసింది. మైదాన ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీలు లేదా అంతకంటే తక్కువ, కొండ ప్రాంతాల్లో 0 డిగ్రీలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే దానిని చలిగాలి రోజుగా పరిగణిస్తారు. అలాగే సాధారణ కనిష్ట ఉష్ణోగ్రత కంటే 4.5 నుంచి 6.4 డిగ్రీలు తగ్గినా అదే కోవలోకి వస్తుంది. డిసెంబర్-ఫిబ్రవరి మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు దేశంలోని కేంద్ర, సమీప ద్వీపకల్ప, వాయువ్య ప్రాంతాల్లో సాధారణం నుంచి తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం కొద్దిగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నది. చలిగాలుల పెరుగుదలకు వెస్టన్ డిస్టర్బెన్సెస్ తగ్గడం ప్రధాన కారణమని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. అలాగే ప్రస్తుత సంవత్సరం లా నినా ప్రభావంలో ఉండడం కూడా చలిగాలుల పెరుగుదలకు కారణమవుతుందని వివరించారు. చలి తీవ్రత పెరుగుదల హెచ్చరికల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వైద్య, ఆరోగ్య నిపుణులు ప్రజలకు సూచిస్తున్నారు. మరీముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఉదయం, రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

## వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై జి.నరేష్ అన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ ఉత్తర్వులపై మండల కేంద్రంలోని సివిల్ కోర్టు సమీపంలో స్థానికులకు, కక్షిదారులకు వారు మంగళవారం ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాక్సిడెంట్లు తగ్గించుట కొరకు, రోడ్ సేఫ్టీ లో భాగంగా ఆలమూరు సెంటర్లో ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డులను కలిగి ఉండాలని తెలియజేస్తూ జొన్నాడ సెంటర్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి హైవే రోడ్ లో మద్యం సేవించి ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు, ఓవర్ లోడు, ట్రాఫిక్ నిబంధనలు పాటించని పదిమంది వాహనదారులపై కేసులు నమోదు చేసి పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలియజేశారు.

## యుటీఎఫ్ ఎస్ఎస్సి స్టడీ మెటీరియల్స్ అందజేత

**ఆలమూరు, పతాకం న్యూస్:** మండలంలోని జొన్నాడ, ఆలమూరు ప్రభుత్వ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సీనియర్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అస్మదుల్లా ఖాన్ ఆర్థిక సౌజన్యంతో ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వారిచే ముద్రించి, ప్రచురింపబడిన ఎస్ఎస్సి స్టడీ మెటీరియల్ ను విద్యార్థులందరికీ ఉచితంగా అందజేశారు. 80 శాతం పైగా మార్కులు స్కోరు చేయడానికి అనువుగా ఈ పుస్తకం రూపొందించబడినదని విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్ చక్కగా వినియోగించుకొని పదవ తరగతి పరీక్షలలో మంచి ఫలితాలను సాధించాలని కోరుతూ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మెర్ల శ్రీనివాస, ఈ సందర్భంగా అస్మతుల్లా ఖాన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ఎ.శ్రీనివాస్, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సముద్ర తీరంపై కొరవడిన నిఘా?



**రణస్థలం, పతాకం న్యూస్:** జిల్లాలోని సముద్ర తీరంపై నిఘా కొరవడింది. దేశాలను దాటి మన జలాల్లోకి విదేశీ మత్స్యకారులు చేరుకుంటున్నా నిఘా వ్యవస్థ గుర్తించలేకపోతుంది. స్థానిక మత్స్యకారులు సమాచారం ఇచ్చేవరకు కూడా విదేశీ మత్స్యకారులు వచ్చిన విషయం తెలియడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అదే జిల్లా మత్స్యకారులు సరిహద్దు జలాలను దాటి బంగ్లాదేశ్, పాకిస్తాన్, చైనా వంటి దేశాల వైపు వెళ్తే వారు సముద్ర జలాల్లో ఉంటుండగానే అక్కడి కోస్టుగార్డులు, రాష్ట్రాల మెరైన్ సిబ్బంది అదుపులోకి తీసుకుంటున్నారు. కానీ, మన దగ్గర మాత్రం విదేశీ మత్స్యకారులు తీరానికి వచ్చిన వరకు కూడా గుర్తించలేకపోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ 193 కిలోమీటర్ల సుదూర సముద్ర తీర ప్రాంతం ఉంది. మొత్తం 11 తీర మండలాలు ఉన్నాయి. రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, గార, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో 120 వరకూ మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. తీర ప్రాంత పరిరక్షణ మెరైన్ పోలీసుల బాధ్యత. కానీ, జిల్లాలో కేవలం భావనపాడు, కళింగపట్నం, బారువలో మాత్రమే మెరైన్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. సిబ్బంది అరకొరగానే ఉన్నారు. తీరంలో గస్తీకి ఆధునిక పరికరాలు లేవు. దీంతో క్రైమ్, ఇతరత్రా పోలీస్ సిబ్బందే అత్యవసర సమయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మరికొన్ని చోట్ల మెరైన్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అవి ప్రతిపాదనలతోనే ఉండిపోయాయి.

ఒక్కో మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు ఏఎస్ఐలతో పాటు ఇతర సిబ్బంది 40 మంది వరకూ ఉండాలి. కానీ ఏ స్టేషన్‌లో కూడా పది మంది సిబ్బంది కూడా లేరు. కొద్దిరోజుల కిందట తీర ప్రాంతంలో పర్యటించిన మెరైన్ డీఐజీ జిల్లాలో మెరైన్ పోలీస్‌స్టేషన్ల సంఖ్య పెంచుతామని ప్రకటించారు. కానీ, ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదు. దీంతో తీర ప్రాంత భద్రతలో ఎప్పటికప్పుడు డొల్లతనం బయటపడుతోంది. తీరంలో గస్తీ కోసం ఎటువంటి పరికరాలు, యంత్రాలు లేవు. వాస్తవానికి తీరంలోని మూడు కిలోమీటర్ల వరకూ మెరైన్ పోలీసులే గస్తీ కాయాలి. కానీ, వారు తీరానికే పరిమితమైపోతున్నారు. ఆధునిక బైనాక్యులర్లు లేవు. తీరంలో వెళ్లేందుకు, పర్యవేక్షించేందుకు బోట్లు సైతం లేవు. సముద్రంలో మత్స్యకారులు చిక్కుకున్నప్పుడు, సముద్ర స్నానాలకు దిగి ప్రజలు గల్లంతైనప్పుడు మెరైన్ పోలీసులు మత్స్యకారులపైనే ఆధారపడుతున్నారు.

వారి బోట్లకు ఆయిల్ పోసుకొని ఆచూకీకి వెతుకుతున్నారు. కొన్నేళ్ల కిందట ప్రభుత్వం రూ.5 కోట్లతో అత్యాధునిక బోట్లు మంజూరు చేసింది. కానీ నిర్వహణ సరిగ్గా లేక ఆ బోట్లు మూలకు చేరాయి. ప్రస్తుతం భావనపాడు మెరైన్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఉగ్ర హెచ్చరికల నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. అటు మెరైన్ సిబ్బందితో పాటు సాధారణ పోలీసులకు తీర ప్రాంత రక్షణ బాధ్యతలు అప్పగించారు. అటు తీరంలో మత్స్యకారులకు కూడా అవగాహన కల్పిస్తున్నారు. కొత్తవారు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారమందించాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెరైన్ పోలీస్‌స్టేషన్లను బలోపేతం చేయడంతో పాటు సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

# మొక్కజొన్న ధర పతనం.. ఆందోళన రైతులు



**ఒంగోలు, పతాకం న్యూస్:** మల్టీఫెక్స్ థియేటర్లలో పాప్‌కార్న్ రూ.300 అని ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో నిత్యం వింటున్నాం. సినిమాపై చర్చ సాగినప్పుడల్లా ఇదే ముందుకు వస్తోంది. ఒక చిన్న గ్లాస్ మొక్కజన్నలతో తయారు చేసే పాప్‌కార్న్ ధర అది. దాన్ని పండించే రైతులకు ఎంత ధర ఇస్తున్నారో వింటో విస్తుపోవాల్సిందే. మొక్కజన్న క్వింటాలు ధర రూ.1,800కు పడిపోయింది. ప్రభుత్వమేమైనా భారీ ధర నిర్ణయించిందా? అంటే అదీ లేదు. కనీస మద్దతు ధరే రూ.2,400. ఈ పాప్‌కార్న్‌పై సాగే చర్చలో రైతులకు ఏం దక్కుతుంది? వ్యాపారులకు ఏం దక్కుతుందో ఆలోచించాల్సిన తరుణం. ఏ పంటకూ గిట్టుబాటు ధరల్లేవని రైతులు గగ్గోలు పెడుతుంటే పాలకులకు పట్టడం లేదు. విదేశాల నుంచి అవసరం లేకున్నా ఆయా దేశాల, ముఖ్యంగా అమెరికా ఒత్తిళ్లకు తలగ్గి పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల ఇక్కడ వాటి ధరలు పడిపోతున్నాయి. ఇప్పటికే శనగల దిగుమతుల వల్ల గింజకొనే నాథుడు కనిపించడం లేదు. కోల్ట్‌స్టోరేజీల్లో ప్రస్తుతం 14 లక్షల క్వింటాళ్లు మూలుగుతున్నాయి. తాజాగా మొక్కజన్న పండించిన రైతుల పరిస్థితీ దయనీయంగా మారింది. అమెరికా అధ్యక్షుడు ట్రంపు ఒత్తిళ్లకు తలగ్గి ఫ్రీ ట్రేడ్ ఒప్పందం చేసుకున్న ఫలితంగా ఇక్కడ మొక్కజన్న ధర వారం రోజుల్లోనే క్వింటాలుకు రూ.300కు పడిపోయింది. కనీస మద్దతు ధర దక్కడం లేదు. మార్కెట్లో కొనేవాళ్లే కనిపించడం లేదు. దాణా కంపెనీలు విదేశాల నుంచి వస్తున్న దిగుమతులను తీసుకునేలా ముందుగానే ఇండెంట్లు తీసుకుంటున్నాయి. దిగుమతి చేసుకునే వాటినే దాణా కంపెనీలు వినియోగిస్తాయి. స్థానికంగా పండించిన మొక్కజన్నను కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఒకవేళ వచ్చినా ధర తగ్గించేస్తున్నారు. దిగుమతుల వల్ల ఇక్కడి పంటకు డిమాండ్ తగ్గుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొక్కజన్న సాగు భారీగా పెరిగింది. పొగాకు, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా మొక్కజన్నను సాగు చేస్తున్నారు. కోళ్ల పరిశ్రమ వచ్చాక కూడా మొక్కజన్న సాగుపై రైతులు ఎక్కువ దృష్టి సారించారు. అన్ని రకాల దాణాల్లో వీటిని వాడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్, రబీలో కలిపి మొక్కజన్న 21,865 ఎకరాల్లో సాధారణ విస్తీర్ణం ఉంది. 25 వేల ఎకరాలకుపైగా మొక్కజన్న సాగు చేస్తున్నారు. ఎకరాకు 35 నుంచీ 40 క్వింటాళ్ల వరకూ దిగుబడి ఉంది. అమెరికాతో ఒప్పందం నేపథ్యంలో దిగుమతుల వల్ల వ్యాపారులు ధర దిగ్గోస్తున్నారని రైతు సంఘాల నేతలు చెబుతున్నారు. పైగా మొక్కజన్న, సోయాబీన్ జన్యుమార్పిడి చేసిన పంటను దిగుమతి చేసుకుంటున్నారు. దాన్ని ఇక్కడ సాగు చేయడానికి వీలుంటుందా? అంటే సాధ్యం కాదని చెబుతున్నారు. వీటితోపాటు ఇప్పుడు స్వీట్‌కార్న్ రూపంలోనూ విదేశాల నుంచి పచ్చి కండెలు దిగుమతి అవుతున్నాయి. ఫలితంగా స్థానిక పండించిన పంటపై ధరల ప్రభావం తీవ్రంగా ఉంది. దిగుమతులు చేటు కలిగిస్తున్నాయని తెలిసినా ట్రంపు దెబ్బకు కేంద్రం ఒప్పందాలు చేసుకుంది. మనపై అన్ని రకాల ఆంక్షలు విధించినా పట్టించుకోవడం లేదని, ఆ దేశానికి భయపడి చేసుకున్న ఫ్రీట్రేడ్ ఒప్పందాల వల్లనే దేశంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేకుండా పోతోందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతులపై గతంలో ఉన్న సుంకాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉన్నప్పటికీ.. 'గుజరాత్ మునిగిపోతోంది': రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నప్పటికీ.. గుజరాత్ మునిగిపోతోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో 'డ్రగ్స్, అక్రమ మద్యం ముప్పు పెరిగిపోతోంది' అని మండిపడ్డారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న 'జన ఆక్రోశ్ యాత్ర' సందర్భంగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు డ్రగ్స్, అక్రమమద్యం మరియు నేరాల ముప్పు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. "గుజరాత్ మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టిన భూమి. ఇక్కడ సత్యం, నైతికత, న్యాయం, సాంప్రదాయం ప్రబలంగా ఉన్నాయి. కానీ గత కొన్ని సంవత్సరాలుగా, రాష్ట్ర యువత భవిష్యత్తు మాదకద్రవ్యాలు మరియు నేరాల చీకటి ప్రపంచ వైపు నెట్టబడుతోంది" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అధికారంలో ఉన్న వారి నుండి నేరస్థులకు రక్షణ లభిస్తున్నందున, వారు నిర్లక్ష్యం చేయబడటం వలనే మహిళలు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వస్తున్నారని అన్నారు. "గుజరాత్ అడుగుతోంది. బిజెపి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది. ఏ బిజెపి మంత్రి వీటన్నింటికీ రక్షణ కల్పిస్తున్నారు. గుజరాత్‌కి దేశద్రోహం చేసేవారిని ఎందుకు కాపాడుతున్నారు" అని పేర్కొన్నారు.

జన ఆక్రోశ్ యాత్ర సమయంలో మరో ప్రధాన సమస్య రైతుల గురించి కూడా ప్రస్తావనకు వచ్చిందని అన్నారు. ఇటీవల వచ్చిన వినాశకరమైన వరదలు వేలాది గుజరాతీ కుటుంబాలను నాశనం చేశాయి. రైతుల పంటలను నాశనం చేశాయి. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, సహాయ ప్యాకేజీల గురించి మాట్లాడుతూనే ఉన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నా.. నేడు గుజరాత్ మునిగిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రధాని అయినప్పటికీ.. గుజరాత్‌కు తగిన ఉపశమనం లభించలేదని మండిపడ్డారు. గుజరాత్ ప్రజలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రతి కుటుంబం తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతోందని అన్నారు. రైతుల రుణాలను ఎందుకు మాఫీ చేయబడలేదు అని, డ్రగ్స్‌ను ఎందుకు అరికట్టడం లేదని ప్రతి కుటుంబం ప్రశ్నిస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆందోళనలను వింటూనే ఉంటుందని, బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని నిరంతరం బయటపెడుతోందని అన్నారు.

# అకస్మాత్తుగా కళ్లు మసకబారుతున్నాయా?

## బ్రెయిన్ స్ట్రోక్‌కు అవకాశమంటున్న నిపుణులు!

లఉన్నట్టుండి కంటి చూపు కోల్పోవడం, అదుపు తప్పి పడిపోవడం, అనూహ్యంగా ప్రవర్తనలో మార్పు కనిపిస్తోందా? ఐతే, తస్మాత్ జాగ్రత్త! అంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇవి బ్రెయిన్? స్ట్రోక్ లక్షణాలు కావొచ్చని చెబుతున్నారు. ఒక్కసారి దీనికి ఎటాక్? అయితే శాశ్వత వైకల్యానికే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అయితే బ్రెయిన్ స్ట్రోక్ రాక ముందే మన శరీరంలో కొన్ని సంకేతాలు కనిపిస్తాయని, వాటిని అసలు నిర్లక్ష్యం చేయవద్దని సూచిస్తున్నారు. మరి, స్ట్రోక్ రాకముందు ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం!

తలతిరగడం అనేది ఒక సాధారణ సమస్యగా చాలా మంది భావిస్తారు. ఎందుకంటే సరిగ్గా తినకపోవడం, తగినంత నీరు తాగకపోవడం, ఎండలో ఎక్కువసేపు ఉండటం, నిద్ర నుంచి ఒక్కసారిగా లేచినప్పుడు ఇలా జరగడం మాములే అని ఈ విషయాన్ని లైట్? తీసుకుంటారు. కానీ, బ్రెయిన్? స్ట్రోక్? వచ్చే ముందు తలతిరగడం, స్పృహ కోల్పోవడం, మూర్ఛలు, జ్ఞాపకశక్తి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అధ్యయనం పేర్కొంది.

తలనొప్పి చాలా సాధారణం, కానీ బ్రెయిన్ స్ట్రోక్ వల్ల వచ్చే తలనొప్పి భిన్నంగా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉదయం నిద్ర లేవగానే తీవ్రంగా ఉండవచ్చని లేదా సమయం గడిచే కొద్దీ తీవ్రత పెరుగుతూ ఉంటుందని పేర్కొంటున్నారు. మొబైల్ ఫోన్లు, టీవీ, ల్యాప్‌టాప్, కంప్యూటర్ స్క్రీన్‌ల ముందు గంటల తరబడి గడపడం వల్ల ఈ సమస్య వచ్చే అవకాశాలు ఉందంటున్నారు. అలాగే, మానసిక ఒత్తిడి, మైగ్రేన్, సైనస్ వల్ల కూడా ఈ సమస్యకు అవకాశం ఉందని తెలియజేస్తున్నారు. అయితే



ఈ తలనొప్పిని అన్ని వేళలా లైట్? తీసుకుంటే ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.

ఎటువంటి కారణం లేకుండా అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి అనేది స్ట్రోక్‌కు సంకేతమని అధ్యయనం పేర్కొంది. ఎందుకంటే మెదడుకు వెళ్లే రక్తనాళాల్లో అడ్డంకి ఏర్పడటం వల్ల బ్రెయిన్?కి ఆక్సిజన్ సరఫరాకు అంతరాయం కలుగుతుందంటున్నారు నిపుణులు. దీని వల్ల తీవ్రమైన తలనొప్పి వస్తుందని, ఇలాంటి పరిస్థితిని లైట్‌గా తీసుకోకూడదని సలహా ఇస్తున్నారు.

సరైన పోషకాహారం తీసుకున్నా, ప్రశాంతంగా నిద్రపోయిన కూడా కొంతమందికి తీవ్ర అలసటగా ఉంటుంది. దీనితో పాటు భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోవడం, చిన్న పనికే శక్తిలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే స్ట్రోక్ సంకేతమంటున్నారు నిపుణులు. అందుకే ఇలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత డాక్టర్లను సంప్రదించడం మేలని సూచిస్తున్నారు.

ఎక్కువసేపు నిద్రపోయిన లేదా స్థిరంగా కూర్చునప్పుడు చేతులు, కాళ్లలో తిమ్మిరిగా అనిపించడం మాములే. కానీ, కారణం లేకుండా తిమ్మిరి తీవ్రంగా, దీర్ఘకాలంగా ఒకే వైపుగా ఉంటే అది స్ట్రోక్?కు ముందుగా కనిపించే ముఖ్య లక్షణమంటున్నారు నిపుణులు. బ్రెయిన్?కు రక్త ప్రసరణ తగ్గినప్పుడు శరీరంలో ఒకవైపు సిగ్నల్స్ సరిగా వెళ్లావని, దీంతో ముఖంలో ఒకవైపు, చేయి, కాలు లేదా భుజం భాగంలో తిమ్మిరిగా అనిపిస్తుందని పేర్కొంటున్నారు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో సంబంధిత డాక్టర్?ను సంప్రదించడం మంచిదని చెబుతున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు ముందుగా కనిపించే ముఖ్యమైన లక్షణాల్లో చూపు మందగించడం ఒకటని నిపుణులు చెబుతున్నారు. చాలా మందికి ఇది సాధారణ కళ్ల సమస్యలా అనిపించవచ్చని, కానీ కారణం లేకుండా అకస్మాత్తుగా చూపు మసకబారడం, స్పష్టంగా చూడలేకపోవడం, వస్తువులు రెండుగా కనిపించడం వంటివి స్ట్రోక్?కు హెచ్చరిక సంకేతమని వెల్లడిస్తున్నారు. అకస్మాత్తుగా ఒకటి లేదా రెండు కళ్లలో దృష్టి మసకబారవచ్చని అధ్యయనంలో తేలింది.

స్ట్రోక్‌కు ముందుగా కనిపించే ముఖ్యమైన లక్షణాల్లో ఈ సమస్య ఒకటి. సాధారణంగా ఒక వ్యక్తి స్పష్టంగా మాట్లాడే సామర్థ్యాన్ని కోల్పోతే నిర్లక్ష్యం చేయరాదని నిపుణులు చెబుతున్నారు. ఆకస్మిక గందరగోళం, మాట్లాడటంలో ఇబ్బంది లేదా మాట అర్థం చేసుకోవడంలో ఇబ్బందిగా ఉంటుందని అంటున్నారు.

# చలికాలంలో చర్మానికి ఎక్కువ కేర్ అవసరం



మామూలు సమయాల్లో కంటే చలికాలంలో చర్మానికి ఎక్కువ కేర్ అవసరం. ఈ టైమ్‌లో చర్మం పగుళ్లు తేలి ఇబ్బంది పెడుతుంటుంది. ఈ సమస్యకి ఇంట్లోని కొన్ని పదార్థాలను ఉపయోగించి ఫుల్ స్టాప్ పెట్టేయొచ్చు. అవేంటి.. వాటిని ఎలా ఉపయోగించాలో ఇప్పుడు చూద్దాం.. చర్మాన్ని, ముఖాన్ని అందంగా ఉంచుకోవాలని అందరూ అనుకుంటారు. దీని కోసం ఎన్నో మాయిశ్చరైజర్స్ క్రీమ్స్ రాస్తుంటారు కూడా. అయితే, మామూలు సమయాల్లో ఓకే శీతాకాలంలో మాత్రం ఎన్ని క్రీమ్స్ రాసినా చర్మం మాత్రం పొడిగానే ఉంటుంది. అలాంటప్పుడు కొన్ని ఇంట్లోనే దొరికే వస్తువులతో చర్మం, ముఖాన్ని అందంగా మార్చుకోవచ్చు. అయితే, దానికి కొన్ని పద్ధతులు అలా చేయడం వల్ల చర్మం చాలా అందంగా ఉంటుంది. ముందుగా ముఖాన్ని, చర్మాన్ని క్లీన్ చేసుకోవాలి. అయితే, ఇందుకు చలిగా ఉంది కదా అని ఎక్కువగా వేడినీటిని ఉపయోగించకూడదు. ఇలా చేయడం వల్ల చర్మంలోని తేమశాతం తగ్గుతుంది. కాబట్టి ఎప్పుడూ కూడా గోరువెచ్చని నీటిని మాత్రమే ఉపయోగించాలి. ఇది ప్రతీ ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. ఈ సమయంలో ఎప్పుడూ కూడా చర్మానికి పోషణ చాలా అవసరం. అయితే ఇవి ఖరీదైన క్రీమ్స్‌నే వాడాల్సిన అవసరం లేదు. ఇంట్లోని కొన్నింటిని ఉపయోగించి మాయిశ్చరైజర్స్‌లా వాడొచ్చు. అవేంటంటే..

కొబ్బరినూనెలో మాయిశ్చరైజింగ్ గుణాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి దీనిని ఉపయోగించి మాయిశ్చరైజింగ్ తయారు చేయొచ్చు. దీనికోసం ఓ టేబుల్ స్పూన్ కొబ్బరినూనెని తీసుకోండి. ఇందులో హాఫ్ టీస్పూన్ రోజ్‌వాటర్ వేసి బాగా కలపండి. ఇలా తయారైన మిశ్రమాన్ని ముఖం, చర్మంపై బాగా మర్దనా చేయండి. ఆలివ్ ఆయిల్‌లోనూ మంచి మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. ఇది చర్మానికి ఎంతగానో పోషణనిస్తుంది. ఇందుకోసం ఓ స్పూన్ ఆలివ్ ఆయిల్ తీసుకోవాలి.. ఇందులో హాఫ్ స్పూన్ నిమ్మరసం కలిపాలి. మీకు కావాలంటే ఈ కొలతలతోనే మాయిశ్చరైజింగ్ కలుపుకోవాలి. ఇలా తయారైన మిశ్రమాన్ని రాత్రి పడుకునేటప్పుడు ఫేస్, స్కిన్‌కి అప్లై చేసి మసాజ్ చేయడం వల్ల నిగారింపు మీ సొంతం. పాలలో మంచి మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. దీన్ని ఉపయోగించి చర్మాన్ని మెరిపించొచ్చు. ఇందుకోసం కాసిన్ని పాలు తీసుకుని అందులో పావు శాతం తేనె కలపాలి.. ఇలా తయారైన మిప్రమాన్ని మాయిశ్చరైజింగ్‌లా వాడుకోవచ్చు. ముందుగా ఆలివ్ ఆయిల్, పాలు ఒక్కో స్పూన్ పరిమాణంలో తీసుకుని ఇందులో హాఫ్ స్పూన్ నిమ్మరసాన్ని బాగా కలపాలి. దీన్ని బాగా మసాజ్ చేయడం వల్ల కొన్ని రోజుల్లోనే వచ్చిన మార్పుని గమనించవచ్చు.బాదం నూనె కూడా మంచి మాయిశ్చరైజింగ్‌గా పనిచేస్తుంది. బాదం, కొబ్బరి, నువ్వులనూనెలను సమాన పరిమాణంలో తీసుకుని బాగా కలపాలి. ఇలా చేయడం వల్ల సిల్కీ చర్మం మీ సొంతం అవుతుంది. దోసకాయరసంలో కాసింత నిమ్మరసం కలిపి ఆలివ్ నూనె కలిపి బాడీకి అప్లై చేసి బాగా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల మంచి నిగారింపు సొంతం అవుతుంది.

కొబ్బరి పాల్లో మంచి మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. ఓ స్పూన్ కొబ్బరి పాలల్లో కొబ్బరి నూనెని కలిపి బాగా మిక్స్ చేయాలి. ఇలా తయారైన మిశ్రమాన్ని బాగా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల త్వరలోనే మంచి మెరుపు సొంతం అవుతుంది.

కలబందలో మంచి మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. రెగ్యులర్‌గా ఈ జెల్‌ని రాయడం వల్ల చక్కని మెరుపు వస్తుంది. చర్మంలో ఈ జెల్‌ని కాస్తా తీసుకుని అందులో ఏదైనా ఆల్మండ్ ఆయిల్, నువ్వుల నూనె కలిపి రాయడం వల్ల చక్కని కొద్దిరోజుల్లోనే వచ్చే మార్పుని మీరు గమనించవచ్చు. ఓ స్పూన్ బాదం నూనెలో కాసింత తేనె కలిపి మర్దనా చేస్తుండాలి. ఇలా చేయడం వల్ల త్వరగానే చర్మంలో మంచి నిగారింపు వస్తుంది. ఇలా రెగ్యులర్‌గా చేస్తుండాలి. త్వరలోనే మంచి నిగారింపు వస్తుంటుంది.

స్నానానికి ముందు కాసింత వెన్నె తీసుకుని అందులో చిటికెడు పసుపు, రెండు చుక్కల నిమ్మరసం కలిపి ముఖంపై మర్దనా చేయండి. అనంతరం స్నానం చేయండి. ఇలా చేయడం వల్ల త్వరలోనే మంచి నిగారింపు మీ సొంతం అవుతుంది.

# 75 కిలోల ధాన్యానికిచ్చేది రూ.1300 మాత్రమే

## అధిక తేమ శాతం పేరుతో కొనుగోలు కేంద్రాల్లో తిరస్కరణ



**గుంటూరు, పతాకం న్యూస్:** గుంటూరు జిల్లా పచ్చలతాడిపర్రుకు చెందిన రైతు పి.వెంకట్రావు తన ధాన్యం అమ్మకం కోసం శ్యాంపిల్స్ తీసుకొని పొన్నూరులోని కొనుగోలు కేంద్రానికి వెళ్లారు. తేమ శాతం 28 ఉందని, ఈ ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని అధికారులు తేల్చి చెప్పారు. వెల్లలూరుకు చెందిన రైతు ప్రభాకరరావుకు, కసుకుర్రు గ్రామానికి చెందిన సుబ్రమణ్యానికి కూడా ఇదే అనుభవం ఎదురైంది. దీంతో, ఈ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు 75 కిలోల బస్తాను రూ.1300 చొప్పున అమ్ముకోవాల్సి వచ్చింది. బస్తా ఒక్కంటికీ రూ.492 చొప్పున నష్టపోయారు. జిల్లాలోని ఇతర రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు.

జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగు తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట విక్రయానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ప్రధానంగా ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉందనే పేరుతో కొనుగోలు కేంద్రాల్లో తిరస్కరిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారులు ధరలో భారీ కోత విధిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.62 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దాదాపు 3.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో 70 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 209 రైతు సేవా కేంద్రాల పరిధిలో 47 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇటీవల వచ్చిన మొంథా తుపాను వరిపై తీవ్ర ప్రభావం చూపింది. దిత్వా తుపాను నేపథ్యంలో పొలంలో ఉన్న ధాన్యం వెంటనే విక్రయించకపోతే తడిసిపోతుందనే భయంతో రైతులు ఉన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే తేమ ఎక్కువగా ఉందనే పేరుతో తిరస్కరిస్తున్నారు.

దీంతో, వ్యాపారులకు అయినకాడికి విక్రయించుకుంటున్నారు. ఆదివారం పొన్నూరులో వర్షం జల్లులు ప్రారంభం కావడంతో పొలాల్లో ఉన్న ధాన్యాన్ని లారీలకు ఎత్తడం కన్పించింది. నాలుగు రోజులుగా తుపాను హెచ్చరికలతో వరి కోతలను యంత్రాల ద్వారా చేసి వెంటనే నూర్పిడి చేయించి అక్కడికక్కడే విక్రయించేస్తున్నారు. మిషన్ల ద్వారా నూర్పిడి చేసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్తే అక్కడి అధికారులు, మిల్లర్లు విధిస్తున్న ఆంక్షలు తమను ఇబ్బంది పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా తేమ 17 శాతం మించితే ధాన్యం కొనుగోలుకు అధికారులు తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచు కురుస్తుండడం, వాతావరణం ఎక్కువగా మేఘావృత్తమై ఉండడం వల్ల ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ధాన్యం ఆరబెట్టుకునేందుకు వసతులు లేని రైతులు వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు. తగిన స్థలాలు లేక ప్రధానంగా రోడ్డుపై పోయాల్సి వస్తోందని పలువురు రైతులు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం 'ఎ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389 ధర ప్రకటించింది. దీని ప్రకారం 75 కిలోల బస్తా రూ.1,792కు కొనుగోలు చేయాలి. సాధారణ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,369 ప్రకటించింది. దీని ప్రకారం 75 కిలోల బస్తా రూ.1776కు కొనుగోలు చేయాలి. రెండు రోజుల క్రితం వరకు బస్తా రూ.1400కు కొనుగోలు చేయగా, తుపాను హెచ్చరికలతో వ్యాపారులు ధరను రూ.1300కు తగ్గించేశారు.

# వెనిజులాకు విమాన సర్వీసులను పునరుద్ధరిస్తాం : పెట్రో



**బొగోటా :** కొలంబియా, వెనిజులాల మధ్య విమాన సర్వీసులను పునరుద్ధరిస్తామని కొలంబియా అధ్యక్షుడు గుస్తావొ పెట్రో మంగళవారం పునరుద్ఘాటించారు. కరేబియన్ సముద్రతీరంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో వెనిజులా, దాని చుట్టుపక్కల గగనతలాన్ని పూర్తిగా మూసివేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ఆదేశాలను పెట్రో సవాలు చేశారు. "వెనిజులా వైమానిక ప్రాంతాన్ని మూసివేయడానికి అమెరికాకు హక్కులేదు. తన సొంత విమాన సంస్థలపై ఆధిపత్యాన్ని చెలాయించవచ్చుకానీ.. ప్రపంచంలోని ఇతర సంస్థలకు ఆదేశాలిచ్చే హక్కులేదు. కొలంబియా, వెనిజులాల మధ్య పౌరవిమాన సేవలను పునరుద్ధరిస్తోంది. ఇది చర్చలకు సమయం కానీ.. క్రూరత్వానికి కాదు" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. కమ్యూనిటీ ఆఫ్ లాటిన్ అమెరికా అండ్ కరేబియన్ స్టేట్స్ ' తాత్కాలిక అధ్యక్షుడిగా ఉన్న పెట్రో.. అమెరికా అడ్వైజరీని పరిశీలించడానికి, ప్రతి దేశం తన సొంత గగనతల సార్వభౌమత్వాన్ని నిలుపుకుంటుందనే సూత్రానిన సమర్థించడానికి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థను అభ్యర్థిస్తానని పెట్రో పేర్కొన్నారు. మరో దేశ గగనతలాన్ని మూసివేయాలని మరో దేశ అధ్యక్షుడు ఏకపక్షంగా ఆదేశించడం అంతర్జాతీయ చట్టాన్ని దెబ్బతీయడం, సౌర్వభౌమాధికారాన్ని బలహీనపరచడమేనని ఆయన హెచ్చరించారు. అంతర్జాతీయ నిబంధనలను గౌరవించాలని, దౌత్య ఉద్రిక్తతను పెంచే ఏకపక్ష చర్యలను నివారించాలని ఆయన అమెరికాను కోరారు. కొలంబియా రవాణా మంత్రి ఫెర్నాండా రోజాస్ మాంటిల్లా కూడా అమెరికా ఆదేశాలను ఖండించారు.




# ఓటమికి హెడ్ కోచ్ బాధ్యత వహించాలి: రవిశాస్త్రి



గతేడాది న్యూజిలాండ్ చేతిలో వైట్ వాష్.. ఆ తర్వాత శ్రీలంక, ఆసీస్ వన్డే సిరీస్ ఓటమి.. తాజాగా సౌతాఫ్రికాతో టెస్టులో క్లీన్ స్వీప్.. గౌతమ్ గంభీర్ టీమిండియాకు ప్రధాన కోచ్ అయిన 16 నెలల కాలంలో భారత్ వరుసగా ఘోర పరాభవాలు ఎదుర్కొంటుంది. స్వదేశంలోనే టీమిండియా ఓడిపోతుండటంతో గంభీర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. సౌతాఫ్రికాతో టెస్టులో భారత్ అత్యంత పేలవమైన ఆటతీరు ప్రదర్శించింది. ప్రొటీస్ స్పిన్నర్లను ఎదుర్కోలేక భారత బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. బౌలర్లు కూడా అంతగా ప్రభావం చూపలేకపోయారు. ఫలితం.. సిరీస్ ఓటమి. దీనిపై మాజీ కోచ్ రవి శాస్త్రి తాజాగా స్పందించాడు. 'గువాహటి టెస్టులో టీమిండియా టాప్ ఆర్డర్ ఘోరంగా విఫలమైంది. 95/1 నుంచి కళ్లు మూసి తెరిచే లోపే వరుసగా వికెట్లు కోల్పోయి 130/7తో కష్టాల్లో పడింది. టీమిండియా పేలవమైన జట్టు కాదు. మన ఆటగాళ్లు ఎంతో ప్రతిభావంతులు. వారికి స్పిన్ బౌలింగ్ ఎదుర్కోవడం కూడా కొత్తేమీ కాదు. కాబట్టి కచ్చితంగా ప్లేయర్లంతా మరింత బాధ్యత తీసుకుని ఆడాలి. జట్టు పేలవ ప్రదర్శన విషయంలో నేను గంభీర్‌ను విమర్శించను. కానీ వంద శాతం అతడు బాధ్యత తీసుకోవాలి. నేనే కోచ్‌గా ఉంటే ఓటమికి మొదటి బాధ్యత తీసుకునేవాడిని. కానీ జట్టు సమావేశంలో ఆటగాళ్లను కచ్చితంగా ప్రశ్నించేవాడిని' అని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు.

# కోహ్లీ ఇన్నింగ్స్ చూశాక తొమ్మిదేళ్ల వెనక్కి వెళ్లినట్లు అనిపించింది: కుల్దీప్ యాదవ్



దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఆడిన ఇన్నింగ్స్ చూస్తే దాదాపు ఎనిమిది, తొమ్మిది సంవత్సరాలు వెనక్కి వెళ్ళినట్లు అనిపించిందని టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పేర్కొన్నాడు. 2016-2019 మధ్యకాలంలో మాజీ కెప్టెన్ కోహ్లీ ఎలా బ్యాటింగ్ చేశాడో, ఈ ఇన్నింగ్స్‌లోనూ అదే విధంగా ఆడాడని కుల్దీప్ ప్రశంసించాడు.

రాంచీలోని జేఎస్‌సీఏ ఇంటర్నేషనల్ స్టేడియం కాంప్లెక్స్‌లో దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లలో భాగంగా మొదటి వన్డే జరిగింది. ఈ మ్యాచ్‌లో కోహ్లీ 135 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు.

కోహ్లీ ఇన్నింగ్స్‌పై కుల్దీప్ యాదవ్ స్పందిస్తూ, కోహ్లీ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఆడాడని కొనియాడాడు. కోహ్లీ కెప్టెన్‌గా ఉన్న సమయంలోనే తన క్రికెట్ కెరీర్ ప్రారంభమైందని గుర్తు చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో అతని ఆట చూశాక తాను దాదాపు ఒక దశాబ్దం వెనక్కి వెళ్ళినట్లు అనిపించిందని అన్నాడు.

2016, 2017, 2018, 2019 సంవత్సరాలలో కోహ్లీ బ్యాటింగ్ చేసిన విధానం కూడా ఇలాగే ఉండేదని కుల్దీప్ గుర్తు చేసుకున్నాడు. కీలక సమయంలో కోహ్లీ ఎంతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడని పేర్కొన్నాడు. సందర్భం వచ్చినప్పుడల్లా కోహ్లీ తన సహచరులకు సూచనలు చేస్తుంటాడని తెలిపాడు. కోహ్లీ చాలా మంచి వ్యక్తి అని, అతని నుండి ఎంతో నేర్చుకోవచ్చని కుల్దీప్ యాదవ్ అన్నాడు.




# ‘ఉస్తాద్ భగత్ సింగ్’ ఫస్ట్ సింగిల్‌పై అప్డేట్!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’. గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి ఓ అదిరిపోయే అప్డేట్‌ను చిత్ర బృందం ఇచ్చింది. త్వరలోనే ‘ఉస్తాద్ భగత్ సింగ్’ నుంచి మొదటి పాట అనౌన్స్‌మెంట్ ఉంటుందని అధికారికంగా ప్రకటించింది.

ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. “మీరు ఇష్టపడే ఎనర్జీ, మీరు ఆస్వాదించే డ్యాన్స్, మీరు వేడుక చేసుకునే యాటిట్యూడ్.. ఇవన్నీ ఒకే పాటలో మా కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ అందిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ ప్రకటన త్వరలోనే వస్తుంది. డిసెంబర్ నెల పవర్ స్టార్ వేడుకగా మారుతుంది,” అంటూ ఓ పోస్ట్ చేశారు. దీంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది.

ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండటంతో పాటలపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. పవన్ ఎనర్జీకి, దేవిశ్రీ మ్యూజిక్‌కు, హరీశ్ శంకర్ టేకింగ్ తోడైతే థియేటర్లలో పూనకాలు ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. త్వరలో రాబోయే ఈ పాట అనౌన్స్‌మెంట్ కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ‘అవతార్ 3’ సందడి మొదలు

## 5 నుంచి ఐమ్యాక్స్ అడ్వాన్స్ బుకింగ్స్



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘అవతార్’ సీక్వెల్ నుంచి ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టికి కొనసాగింపుగా రానున్న ‘అవతార్: ఫైర్ అండ్ యాష్’ సినిమా ఐమ్యాక్స్ అడ్వాన్స్ బుకింగ్స్ డిసెంబర్ 5 నుంచి ప్రారంభం కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఈవెంట్ ఫిల్మ్‌గా అభివర్ణిస్తున్నారు.

ప్రముఖ నిర్మాణ సంస్థ ట్వంటీయత్ సెంచరీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని భారత్‌లో డిసెంబర్ 19న భారీ ఎత్తున విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇండియాలో ఇంగ్లీష్, హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి రానుంది.

ఈసారి ఐమ్యాక్స్ అనుభవంతో పాటు, సినీ చరిత్రలోనే తొలిసారిగా డాల్బీ విజన్ సినిమా టెక్నాలజీతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచనుంది.

‘అవతార్’ ఫ్రాంచైజీ గత చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలనాలు తెలిసిందే. విజువల్ వండర్‌గా ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లిన ఈ సిరీస్‌లో మూడో భాగంగా వస్తున్న ‘ఫైర్ అండ్ యాష్’పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఈ నేపథ్యంలో విడుదల తేదీకి రెండు వారాల ముందే అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానుండటంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.






# బాలీవుడ్ తీరుపై దుల్కర్ సల్మాన్ సంచలన వ్యాఖ్యలు



భాషతో సంబంధం లేకుండా పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ బాలీవుడ్ పనితీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య పని సంస్కృతిలో చాలా వ్యత్యాసం ఉందని ఆయన అన్నారు. హిందీలో పెద్ద స్టార్ అనిపించుకోకపోతే తీవ్రమైన నిర్లక్ష్యానికి గురికావాల్సి వస్తుందని తన అనుభవాలను పంచుకున్నారు.

ఓ తాజా ఇంటర్వ్యూలో దుల్కర్ మాట్లాడుతూ.. “బాలీవుడ్‌లో నటించేటప్పుడు, నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చేది. నా చుట్టూ ఇద్దరు వ్యక్తులు ఎప్పుడూ ఉండేవారు. మనం లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్‌గా గుర్తిస్తారు. అలా లేకపోతే సెట్‌లో కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఇవ్వరు, మానిటర్ చూడటానికి కూడా స్థలం కేటాయించరు” అని అన్నారు. 2018లో ‘కార్వాన్’ చిత్రంతో దుల్కర్ హిందీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు.

మలయాళ చిత్ర పరిశ్రమ ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుందని దుల్కర్ వివరించారు. “మా ఇండస్ట్రీలో సినిమాలకు ఎక్కువ ఖర్చు ఉండదు. ఇక్కడ లగ్జరీకి ఎవరూ ప్రాధాన్యం ఇవ్వరు. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. చాలా వస్తువులు ఇంటి నుంచే తెచ్చుకుంటాం” అని రెండు పరిశ్రమల మధ్య ఉన్న తేడాను స్పష్టం చేశారు.

ఇక దుల్కర్ సినిమాల విషయానికొస్తే, ఆయన ఇటీవలే ‘కాంత’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా డిసెంబర్ 12 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు తెలుస్తోంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**